క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ డి.సాంబారెడ్డి తెలిపారు. లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు, సిక్కువాడ, కిషన్‌పుర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, లష్కర్ బజార్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



చుక్కా రాంనర్సయ్యతో వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలో కళాకారులను ప్రోత్సహించాలని కళలను విస్మరించొద్దని ప్రజావాగ్గేయ కళాకారుడు చుక్కా రాంనర్సయ్య అన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులతో ముచ్చటించారు. సమాజాన్ని మేలు కొల్పే శక్తి పాటకు ఉందన్నారు. అన్యాయాలను, అవినీతిని ఎదురించే విధంగా విద్యార్థులు నాయకులుగా ఎదగాలని కోరారు. సమావేశంలో పరిశోధక విద్యార్థులు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డి.తిరుపతి, కేతపాక ప్రసాద్, కె.తిరుపతి, సూర్యకిరణ్, నాగరాజు, చిరంజీవి కళాకారుడు ఎర్ర సూర్య పాల్గొన్నారు.

శ్మశాన వాటికల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ ఏసీరెడ్డి నగర్, మైసయ్యనగర్ ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం శ్మశాన వాటికలను సందర్శించారు. శ్మశాన వాటికల్లో ప్రధాన సమస్యలను పరిశీలించారు. సీపీఎం సర్వేలో భాగంగా సమస్యలను గుర్తించి బల్దియా అధికారులకు సమాచారం అందజేశామని సీపీఎం నాయకురాలు నలిగంటి రత్నమాల తెలిపారు. పరిశీలించిన వారిలో సీపీఎం కార్యకర్తలు ఉన్నారు

లక్ష మల్లెల అలంకరణలో అంజన్న



కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామిని లక్ష మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో భక్తులు అందించిన లక్ష మల్లెలతో దండలను అల్లి స్వామి వారికి వేశారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అంజన్నకు పూలతో పాటు వడమాలతో అలంకరించారు.

నేడు సుమతిరెడ్డిలో ఓరియంటేషన్ ప్రోగ్రాం

హసన్‌పర్తి: మండలంలోని అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నేడు (బుధవారం) ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీటెక్ ఫస్టియర్‌లో ప్రవేశం పొందిన విద్యార్థినులకు సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. బీటెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థినులు, తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఏఓ వేణుగోపాలస్వామి, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

న్యూశాయంపేట : పేదల ఆరోగ్య విషయంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తగినసాయం అందించడానికి సిద్ధంగా ఉందని 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతేయాజ్ అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 14 డివిజన్‌కు చెందిన మూడు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.2.16 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, స్టాలిన్, కుమార్, చిన్ని, మార్క్స్, లింగస్వామి, నగేష్, టోని, ఎల్లయ్య, భరత్, ప్రశాంత్, రాజబాబు, సుధీర్, పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కాలనీ పరిసరాలు

- ఖాళీ స్థలాల్లో మొలచిన ముళ్లపొదలు, పిచ్చి చెట్లు
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు



ఇళ్ల మధ్య అడవిని తలపిస్తున్న ఖాళీ స్థలం



రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలు

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంటలోని పలు కాలనీల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. పోచమ్మకుంటలోని జనావాసాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో అందులో పిచ్చిచెట్లు, ముళ్లపొదలు పెరిగి చెత్తాచెదారంతో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. కాల్వలు మురుగునీటితో నిండి కంపు కొడుతున్నాయి. విషపు పురుగులు, కుక్కలు, కోతులు, దోమలకు ఆవాసంగా మారడంతో కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లతో పిల్లలు , పెద్దలు భయపడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేయడంతో విషజ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఖాళీ స్థలాలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లయన్స్ సేవలు విస్తరింపజేయాలి

- లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్



నూతన అధ్యక్షుడికి బ్యాడ్జ్ అందజేస్తున్న చంద్రశేఖర్ ఆర్య, తదితరులు

హసన్‌పర్తి: లయన్స్ సేవలు విస్తరింపజేయాలని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. లయన్స్‌క్లబ్, హసన్‌పర్తి శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి చంద్రశేఖర్ ఆర్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎక్కువ మొత్తంలో సభ్యులు చేర్పించినట్లయితే సేవ కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఆరెపల్లి శాంతి కిరణ్, కార్యదర్శిగా శ్యాంసుందర్, కోశాధికారిగా రవిలు ప్రమాణ స్వీకారం చేశారు. కృపాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అజిత్‌కుమార్, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ ముచ్చ రాజిరెడ్డి, మొదటి ఉపగవర్నర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఉపగవర్నర్ పుట్ట హరికిషన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రకాష్, కోశాధికారి రఘునాథరెడ్డి, చీఫ్ సెక్రటరీ ఫర్ సర్వీసెస్ మార్గ పభాకర్, లయన్స్ పీఆర్వో రాజమౌళి ,క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖీ సెంటర్

నయీంనగర్ : మహిళలకు అండగా సఖీ సెంటర్ ఉంటుందని, ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ సెంటర్ అడ్మిన్ హైమావతి అన్నారు. మంగళవారం లష్కర్‌బజార్ కమ్యూనిటీ హాల్‌లో సఖీ సేవలపై మహిళలకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖీ వన్ స్టాప్ సెంటర్‌లో ఐదు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సమస్య ఉన్న మహిళలు 181 మహిళ హెల్ప్‌లైన్, చైల్డ్ లైన్ నెంబర్ 1098, 0870-2452112, 7382983088 నంబర్లకు కాల్ చేసి బాధిత మహిళలు సహాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ అనూష, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

కేఎంసీకి పార్థివదేహం అప్పగింత



పార్థివదేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగం సిబ్బందికి అప్పగిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఎంజీఎం : నగరంలోని బ్రాహ్మణవాడకు చెందిన రిటైర్డ్ లెక్చరర్ శోభనబోయిన ప్రభాకర్ యాదవ్ (76) అనారోగ్యంతో మరణించగా వారి సతీమణి ఉమాదేవి, కుమార్తెలు శ్రీలత, వాసవి, అల్లుడు సునీల్ సహకారంతో సమాజహితం కోరి, వైద్య విద్యా నిమిత్తం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాల సిబ్బందికి పార్థివదేహాన్ని అప్పగించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య ఆదేశాల మేరకు పీజీ వైద్యులు, సిబ్బంది పార్థివదేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం శరీరదానం చేస్తే భావి వైద్యులకు వైద్యవిద్య అధ్యయనం కోసం, శాస్త్ర పరిశోధన కోసం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానానికి దాతలు ముందుకు వస్తే తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్‌ను సంప్రదించాలని కోరారు. వివరాలకు 87905 48706, 9490133650 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో బంధుమిత్రులు, సోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, ఉపాధ్యక్షుడు అనంతుల కేదారి, కార్యదర్శి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు మొహీనుద్దీన్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి చర్చలు జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ.రమణ

నయీంనగర్ : దండకారణ్యం, తెలంగాణ రాష్ట్రంలో కాల్పులు విరమించి, శాంతి చర్చలు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక తెలంగాణ కో-కన్వీనర్ ఎంవీ.రమణ, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ ప్రతినిధులు ఇదివరకే కాల్పుల విరమణ ప్రకటించిన మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశంలో వివిధ ప్రజా,హక్కుల సంఘాల బాధ్యులు ఎం.శంకర్ నారాయణ, భరద్వాజ్, డా.చంద్రబాన్, ఎం. సాంబమూర్తి, వెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌపై మధ్యాహ్న భోజనం తయారీ



గ్యాస్ స్టౌపై మధ్యాహ్న భోజనం ప్రారంభించిన హెచ్ఎం చంద్రయ్య

కాజీపేట అర్బన్ : కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామంలో మండల ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ఇక కట్టెల పొయ్యి పొగకు స్వస్తి, గ్యాస్ స్టౌ పై మధ్యాహ్న భోజనం అంటూ గ్యాస్ స్టౌ వంటకాలను మంగళవారం ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య గ్యాస్ స్టౌ వంటకాలను వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గ్యాస్ స్టౌ అందజేయాలనే ఆలోచనకు హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ స్టౌతో పాటు సిలిండర్లను అందజేసినట్లు తెలిపారు. కట్టెల పొయ్యితో వెలువడే పొగనుంచి విద్యార్థులకు, వంట చేసే వారికి విముక్తి లభించిందని అన్నారు. కార్యక్రమంలో జేరిపోతుల దివ్య, ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

నూతన ఔషధాలకు పరిశోధనలు అవసరం

- ఐఐసీటీ సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎన్.లింగయ్య



మాట్లాడుతున్న ఐఐసీటీ సీనియర్ సైంటిస్టు లింగయ్య

కేయూ క్యాంపస్ : భారతదేశంలో క్యాన్సర్, టీబీ వంటి ఔషధాలు తక్కువ ధరకు లభ్యమయ్యే విధంగా తయారు చేసే పద్ధతులకు సంబంధించి పరిశోధనలు అవసరం అని ఆ దిశగా విద్యార్థులు అన్వేషించాలని ఐఐసీటీ సీనియర్ సైంటిస్టు డాక్టర్ నాగారపు లింగయ్య అన్నారు. మంగళవారం ఫార్మసీ కళాశాలలో ఇండియన్ ఫార్మా విజన్ ప్రభావం గురించి విస్తృతోపన్యాసం చేశారు. గోమాత మూత్రం ద్వారా కూడా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రముఖ వైద్యురాలు సరళాదేవి పీసీఓడీ గర్భాశయ క్యాన్సర్ గురించి వివరించారు. జంక్‌ఫుడ్ ద్వారా ఆండ్రోజన్ ఎక్కువగా ఉత్పత్తి కావటం ద్వారా క్యాన్సర్ వస్తుందన్నారు. పురుషుల్లో చీవింగ్‌టొబాకో, స్మోకింగ్ ద్వారా కూడా హెచ్‌పీ వైరస్ సోకే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.కృష్ణవేణి, డీన్ ఆచార్య గాదె సమ్మయ్య, సీనియర్ ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, ఆచార్యులు స్వరూప, రిటైర్డ్ ఆచార్యులు ఎం.సారంగపాణి పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా పలు అంశాలపై పోస్టర్ ప్రజెంటేషన్లు కూడా జరిగాయి.

హిందువుల పండుగలకే ఆంక్షలా?

- విధిస్తే.. కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించక తప్పదు
- బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ



ఆంక్షలపై మున్సిపల్ సిబ్బందిని నిలదీస్తున్న రావు పద్మ, సంతోష్‌రెడ్డి

హన్మకొండ : హిందువుల పండుగలకే ఆంక్షలు, ట్రాఫిక్ సమస్యలు గుర్తొస్తాయా అని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి ప్రశ్నించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పూజలు అందుకునేందుకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తొలగించాలని చూస్తున్నారన్నారు. సమాచారం అందుకున్న పద్మ, సంతోష్ రెడ్డి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద సిద్ధంగా ఉంచిన వినాయకులకు వద్ద మంగళవారం రాత్రి బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని వర్గాల మెప్పు కోసం ప్రభుత్వం హిందువుల పండుగలను అవమానించే చర్యలకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. కేవలం హిందువుల పండగలకే ప్రభుత్వం ఆంక్షలు పెడుతోందని, ప్రభుత్వానికి హిందూ సంప్రదాయ పండుగలకే ఆంక్షలు గుర్తొస్తాయా..? బక్రీద్, ఆ తర్వాత మొహరం వేడుకలకు ఆంక్షలు విధించని ప్రభుత్వం ఇప్పుడు వినాయక చవితికి ట్రాఫిక్ సమస్యలు నెపంగా పెట్టి, 40 ఏళ్ల నుంచి లేని ఆంక్షలు ఇప్పుడు విధిస్తారా అని నిలదీశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకాష్ సింగ్, సంపత్‌రెడ్డి, సంద్ర మధు, ఉడుతల మురళి, హిందు బంధువులు, వి నాయక విగ్రహాల అమ్మకందారులు పాల్గొన్నారు.

ఆర్థిక భారం తగ్గించేందుకు సాండ్ బజార్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వ సాండ్ బజార్ ఏర్పాటు చేస్తున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక అందించాలనే ఉద్దేశ్యంతో మండలంలోని ఉనికిచర్ల సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీహరి మాట్లాడుతూ ఎప్పటి కప్పుడు వినియోగదారులకు సరిపడా ఇసుకను అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం అందరికీ రాదని,బుక్ చేసుకో కుండా వచ్చిన వారికి సిబ్బందే బుక్ చేసి ఇసుకను అందించాలన్నారు.

ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నాగయ్య



సర్వేలో ప్రజలతో మాట్లాడుతున్న నాగయ్య

ఖిలా వరంగల్ : ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపాలని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. వరంగల్ 32, 40వ డివిజన్లలోని బీరన్న కుంట, నానమయ్య తోట, డీకే నగర్, ఎస్ఎస్‌నగర్ ముంపు ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వేలో సీపీఎం నేతలు ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ నగరంలో ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ముంపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, అండర్ డ్రెయినేజీ నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.4,175 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ముంపు కాలనీల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వలపదాసు దుర్గయ్య, సింగారపు బాబు, గున్నాల ప్రభాకర్, అప్పాజీ వాణి, ఉపేందర్, ఎండీ.జుబేదా, మాదాస్ దివ్య, ఎండీ.బేగం, ఎస్‌కే ఇస్మాయిల్, మీర్ సాజియా, ఎస్‌కే యాకూబ్‌పాషా, మాసూబి, రజిత, విజయ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- జిల్లా న్యాయసేవాధికారిత సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్షమాదేశ్ పాండే

హసన్‌పర్తి : మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా న్యాయసేవాధికారిత సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. మండలంలోని బైరాన్‌పల్లిలో మంగళవారం మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ కుట్టుశిక్షణ ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. మహిళలకు అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరువైందన్నారు. ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యురాలు అనితారెడ్డి, ఎఫ్ఎంఎం సాంఘీక సేవా ప్రతినిధులు కరుణ, ఎర్ర శ్రీకాంత్, మండల కో-ఆర్డినేటర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

హన్మకొండ : చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి కేరళ ప్రభుత్వం తరహాలో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు, రాయితీలు ప్రకటించాలని, రూ. వెయ్యి కోట్లతో చేనేత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు డిమాండ్ చేశారు. మంళవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించడానికి మార్కెటింగ్ సౌకర్యం అందిస్తుందన్నారు. చేనేత హస్తకళల కళాకారులకు ఆర్థికసాయ పథకం (ఆశా), ఎంట్రప్రెన్యూర్ సపోర్ట్ స్కీమ్ (ఈఎస్ఎస్) వంటి పథకాలను ఎంఎస్ఎంఈలకు వర్తింపజేస్తున్నదని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి చేయూత ఇవ్వాల్సింది పోయి కేంద్ర ప్రభుత్వానికి చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జీఎస్టీ రద్దు చేయాలని లేఖ రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేనేత కార్మికులను తప్పుదోవ పట్టించడానికి కేంద్ర ప్రభుత్వానికి తూతూ మంత్రంగా లేఖ రాయడం రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవడమేనని భావించాల్సి వస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. చేనేత రంగాన్ని కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

పద్మాక్షిదేవికి వైభవంగా వరలక్ష్మీ హోమం



మహాలక్ష్మి హోమం నిర్వహిస్తున్న దేవాలయ పండితుడు నాగిళ్ల పద్మనాభ అవధాని

హన్మకొండ అర్బన్ : నగరంలోని పద్మాక్షికాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పద్మాక్షిదేవిని తామర పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించినట్లు దేవాలయ పండితులు నాగిళ్ల షణ్ముక పద్మానాభ అవధాని తెలిపారు. అనంతరం భక్తుల ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయ, వివాహం కోరికలు నెరవేరడంతో పాటు ఆర్థిక అభివృద్ధి చెందడానికి మహాలక్ష్మి హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మధుసూదన్, రాము, దేవాలయ ట్రస్ట్ సభ్యులు సదానందం, హరీష్, శరత్, భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

ఘనంగా మంత్రి సురేఖ జన్మదిన వేడుకలు



ఖిలావరంగల్ : పేదలకు నిత్యావసర కిట్లను అందజేస్తున్న నవీన్‌రాజు



హన్మకొండ కల్చరల్ : మంత్రి సురేఖకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న గంగు ఉపేంద్రశర్మ

ఖిలావరంగల్ : దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వరంగల్ స్టేషన్‌రోడ్డులోని రాధాకృష్ణ గార్డెన్‌లో తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోపాల నవీన్‌రాజు టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎలగం సత్యనారాయణతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ముంపు ప్రాంతాలకు చెందిన 800 మంది కుటుంబాలకు బియ్యంతో పాటు 11 రకాల నిత్యావసర సరుకుల కిట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంపత్, వేణు, కార్పొరేటర్లు కొండా అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ లీగల్ : జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో కాంగ్రెస్ వరంగల్ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ రమేష్, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు శేఖర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.


'భద్రకాళి'లో మంత్రి పేరున పూజలు

హన్మకొండ కల్చరల్ : మంత్రి కొండా సురేఖ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం భద్రకాళి దేవాలయంలో ఆలయ ఈఓ రామల సునీత ఆధ్వర్యంలో అర్చకులు మంత్రి పేరుమీద ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ దంపతులు దేవాలయాన్ని సందర్శించారు. అలాగే శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు దేవాలయంలో నిర్వహించే నిత్యాన్నదానం కోసం రూ.25 వేలు విరాళంగా అందజేశారు.

అర్చకులను కాపాడాలి

భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండి నిరంతరం దేవాలయాల అభివృద్ధి అర్చక ఉద్యోగుల సంక్షేమం, ధూప దీపనైవేద్య అర్చకుల భవిష్యత్ ప్రశ్నార్థకం కాకుండా కాపాడాలని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ కోరారు.

సైన్స్ కాంగ్రెస్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కేయూ ఆడిటోరియంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ స్వర్ణోత్సవంలోకి అడుగిన వేళ టాస్, కేయూ సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమై రాత్రి వరకు కొనసాగింది. విద్యార్థుల్లో యువతలో సైన్స్ అండ్ టెక్నాలజీ నూతన ఆవిష్కరణలపై నైపుణ్యాలు పెంచుకోవాలనే విధంగా ప్రేరణ కలిగించే విధంగా ఉపన్యాసాలు కొనసాగి స్ఫూర్తిని నింపారు. వివిధ విభాగాలల్లో ఇన్వైటెడ్ టాక్స్ మొత్తం 14 ఫిజిక్స్, మ్యాథ్స్, కామర్స్, కెమిస్ట్రీ జువాలజీ, ఫార్మసీ సెమినార్ హాల్స్‌లో ప్రముఖ ఆచార్యులతో వివిధ అంశాలపై ప్రసంగించారు. ఉదయం ఆడిటోరియంలో గుస్సాడి నృత్యం ఆకట్టుకుంది. అతిథులను ఆడిటోరి యంలోనికి గుస్సాడి నృత్యం చేస్తూ తీసుకొచ్చారు. రాత్రి పేరణి నృత్యం, కూచిపూడి, ఒగ్గుకథతో ఆకట్టుకుంది.